




అసంపూర్తిగా ఉన్న ఐటీ హబ్ రెండో భవనం

నిధుల్లేక నీరసం!

- నత్తనడకన రెండోదశ ఐటీ హబ్ పనులు
- రెండేళ్లుగా కదలిక లేని వైనం

ఖమ్మం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఐటీ రంగ విస్తరణలో భాగంగా ఖమ్మంలో చేపట్టిన రెండోదశ ఐటీహబ్ పనుల్లో నిధులు లేక నీరసం ఆవహించింది. నిధులు లేక నిర్మాణ పనులు ఆగిపోయాయి.. ఇవి ప్రారంభమై రెండేళ్లు దాటినా కదలిక కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఖమ్మంలోఐటీహబ్ మొదటి దశను రూ.25కోట్లతో నిర్మించారు. దీంతో పలు ఐటీ సర్వీస్ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి. తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఆధ్వర్యంలో మొదటి ఫేజ్ పనులు పూర్తిచేయడంతో సుమారు 400మందికి ఇక్కడ ఉద్యోగ అవకాశాలు లభించాయి. రూ.50కోట్లతో ఐదు అంతస్థులతో రెండోదశ కింద గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. ఆతర్వాత నిధులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపివేశారు. ఐదు అంతస్థులకు (మిగతా 6వ పేజీలో)



ఏసీబీ అధికారులకు పట్టుబడిన సివిల్ సప్లయీస్ డీటీ యాకుబ్ పాషా, విజయ్, శబరీష్

ఏసీబీకి చిక్కిన ఇల్లెందు

సివిల్ సప్లయీస్ డీటీ

- రేషన్ షాప్ సీజ్ చేయకుండా ఉండేందుకు లంచం డిమాండ్
- టెక్నికల్ అసిస్టెంట్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అరెస్టు

ఇల్లెందు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రేషన్‌షాపులోని స్టాక్ వివరాల్లో తేడాలను ఆసరాగా చేసుకున్న సివిల్‌సప్లయీస్ డీటీ ఒకరు.. సదరు షాపును సీజ్ చేయకుండా ఉండాలంటే రూ.30వేలు లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కాడు. ఈసంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో సోమవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు, టేకులపల్లి, మండలాల్లో సివిల్‌సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎండీ యాకుబ్ పాషా ఈ నెల 7న ఇల్లెందు మండలంలో ఓ గిరిజన మహిళా డీలర్‌కు చెందిన రేషన్ షాప్‌ను తనిఖీ చేశాడు. షాపులో (మిగతా 6వ పేజీలో)

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది పత్తి రైతుల పరిస్థితి. అసలే ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు దిగుబడి రాక దిగులు చెందిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు మద్దతు ధర కోసం అమ్మకానికి పోతే అక్కడ తేమ శాతం ఎక్కువైందని, క్వాలిటీగా లేదని కొర్రీలు పెట్టి సీసీఐ అధికారులు, మిల్లర్లు వారిని నట్టేట ముంచుతున్నారు.



గుర్రాలపాడు జిన్నింగ్ మిల్లు వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

పత్తి రైతుల పరేషాన్!

- కపాస్ కిసాన్ యాప్‌తో తప్పని తిప్పలు
- మిల్లర్లకు నచ్చని సీసీఐ నిబంధనలు
- రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగిన జిన్నింగ్ మిల్లర్లు
- నష్టపోతున్న రైతులు.. పట్టించుకోని అధికారులు

ఖమ్మం మార్కెట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీసీఐ, జిన్నింగ్ మిల్లర్ల మధ్య ఎప్పట్నుంచో తలెత్తిన ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4 సమస్యతో పాటు ఎకరానికి 7 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు తదితర నిబంధనలు పెద్ద సమస్యగా మారాయి. దీంతో కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ రాష్ట్రం వ్యాప్తంగా సీసీఐ పత్తి కొనుగోళ్ల బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో పత్తి రైతులకు గుండెలు బాదుకుంటున్నారు. సోమవారం నుంచి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన 8, భద్రాద్రి జిల్లాల్లో ఏర్పాటు చేసిన 4 సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో సీసీఐ వర్సెస్ జిన్నింగ్ మిల్లర్స్ మధ్య గొడవ కారణంగా కొనుగోళ్ల నిలిపివేయడంతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తిప్పలు తెచ్చిపెట్టిన కపాస్ కిసాన్ యాప్

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పత్తిని అమ్ముకోవాలంటే ముందుగానే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని కొత్త నిబంధన పెట్టింది. దీంతో స్మార్ట్ ఫోన్ లేని, అసలు ఫోన్ అంటూ లేని రైతన్నలు స్లాట్ బుక్ ఎలా చేసుకోవాలో, ఎలా తమ వివరాలు అప్‌లోడ్ చేయాలో తెలియక అవస్థలు పడ్డారు.

అంతేకాకుండా తమ కుటుంబంలోని ఇతర సభ్యుల ఫోన్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని స్లాట్‌బుక్ చేసినా కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతం, నాణ్యతలోపం తదితర తిప్పలు తప్పట్లేదంటూ వాపోతున్నారు.

అంతేకాకుండా సీసీ బయ్యర్లు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో కుమ్మక్కై పత్తి రైతులను నట్టేట ముంచుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సీసీఐ అధికారులకు తరుగు 12శాతం లోపు ఉంటేనే పాస్ చేయండన్న (మిగతా 6వ పేజీలో)

నేడు స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి

గిరి ప్రదక్షిణ

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వయంభు దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణ మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, అర్చకులు తెలిపారు. ప్రతి నెల స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18న ప్రారంభించిన గిరి ప్రదక్షిణకు భక్తుల నుంచి అనూహ్య స్పందన రావటంతో ప్రతి నెల నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. భక్తులు మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఆలయానికి చేరుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనాలని కోరారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో

భగవద్గీత కంఠస్థ పోటీలు

భద్రాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని కృష్ణుని ఆలయంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రాంత అర్చక పురోహిత్ ప్రముఖ్ ఓరుగంటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ భగవద్గీత అనేది ఒక పవిత్ర గ్రంథం కాదని, అది మానవ జీవితానికి కర్మక సిద్ధాంతానికి, ధర్మానికి నిదర్శనమన్నారు. ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని మనకు అందిస్తుందన్నారు. అనంతరం భగవద్గీత కంఠస్థ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రఖండ కార్యదర్శి కొమ్మరాజు నాగేశ్వరరావు, మేకల సిద్ధార్థ, భీమపాక వెంకటరమణారావు, గంగాధర సీత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకుంటాం..

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- అందుకోసమే ఈ జనంబాట
- సర్కారును ప్రశ్నించడంలో బీజేపీ, బీఆర్ఎస్ విఫలం
- అందుకే ప్రతిపక్షపాత్రను మేం తీసుకున్నాం
- జిల్లా పర్యటనలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత
- జమలాపురం ఆలయంలో పూజలతో ప్రారంభం
- సత్తుపల్లి, పెనుబల్లి, తల్లాడ, వైరా, మధిర మండలాల్లో పర్యటన



సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో కార్మికులతో మాట్లాడుతున్న కవిత

ఎర్రుపాలెం/సత్తుపల్లి/పెనుబల్లి/వైరా/తల్లాడ/మధిర రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు సక్రమంగా నెరవేర్చలేకపోయిందని, వీటిపై ప్రశ్నించడంలో బీజేపీ, బీఆర్ఎస్ విఫలమయ్యాయని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు జాగృతి జనం బాట పేరుతో ఆమె రెండ్రోజుల పాటు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. సోమవారం ఎర్రుపాలెం మండలం జమలాపురం వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆమె తన తొలిరోజు పర్యటనను ప్రారంభించారు. జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆమె పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వైరా, మధిరలో పర్యటించారు. ఈ క్రమంలో సీతారామ టన్నెల్ పనులు, సింగరేణి ఓపెన్‌కాస్ట్, పెనుబల్లి మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. ఈ క్రమంలో ప్రభుత్వంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ముఖ్యంగా మాజీమంత్రి హరీష్ రావుపై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఊరూరా తిరిగి ప్రజాసమస్యలను తెలుసుకుని.. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కారానికి (మిగతా 6వ పేజీలో)

రామారావు హత్యపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి

- ఆ పార్టీ గూండాలను కాపాడుతున్న పోలీసులు
- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- సామినేని కుటుంబానికి పరామర్శ

చింతకాని, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల దారుణ హత్యకు గురైన చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ, జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కవిత ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. రామారావు హత్య జరిగి 17 రోజులవుతున్నా హంతకులను పట్టుకోవడంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. బాధిత కుటుంబం, రామారావు భార్య స్వరాజ్యం చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకుని హత్య చేసిన కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయకుండా పోలీసులు వారిని కాపాడుతున్నారన్నారు. హత్య చేసిన వారిని వదిలేసి రామారావు కుటుంబ సభ్యులను, సీపీఎం నాయకులను విచారించడాన్ని చూస్తే పోలీసులు కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రామారావు హత్యకు సమాధానం



రామారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

చెప్పాలని, ఈ కేసు విచారణలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కవిత వెంట సామినేని అప్పారావు, సీపీఎం నాయకులు కొండ్రు జానకిరాములు, కాటబత్తిన వీరబాబు, జాగృతి సభ్యులు, రామారావు కుమారుడు విజయ్ ఉన్నారు.



ముక్కోటికి

సన్నద్ధత ఇంకెప్పుడు?

- మిగిలింది నెల రోజులే..
- వివిధ పనులకు ఇంకా ఖరారు కాని టెండర్లు
- ముక్కోటి ముందస్తు ఏర్పాట్లపై 20న కలెక్టర్ సమీక్ష

భద్రాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన ఉత్సవాలు రెండు. అందులో ఒకటి శ్రీరామనవమి, కాగా మరోటి ముక్కోటి.అయితే ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు డిసెంబరు 20 నుంచి జనవరి 9 వరకు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో 20 నుంచి దశావతార అలంకారాల్లో భద్రాద్రి రామయ్య భక్తులకు దర్శనమివ్వనున్నారు. అయితే ఇందుకు కేవలం నెల రోజుల సమయం మాత్రమే ఉండగా నేటివరకు దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని చేపట్టాల్సిన వివిధ పనులకు సంబంధించిన టెండర్లు ఇంకా ఖరారు కాలేదని సమాచారం. వాస్తవానికి 45 నుంచి 50 రోజుల ముందు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను దేవస్థానం అధికార వర్గాలు చేపడుతుంటాయి. గతేడాది రూ.1.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ కేటాయించారు. రూ.84 లక్షలతో 15 రకాల పనులను చేపట్టారు. ఈసారి సైతం సుమారు రూ.1.50 కోట్లతో వివిధ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఈ ప్రొక్యూర్‌మెంటులో టెండర్లను ఆహ్వానించినప్పటికీ ఇంకా దేవస్థానం అధికారులు పూర్తిస్థాయిలో వాటిని ఖరారు చేయలేదని సమాచారం. మిథిలా స్టేడియంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అధ్యయనోత్సవ వేదిక, విద్యుత్ దీపాలంకరణ, తాత్కాలికంగా భక్తుల వసతి షెడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం, హంసాలంకృత తెప్ప తయారీతో పాటు ఇతరత్రా పనులు చేపట్టాల్సి ఉంది. టెండర్లను ఇంకా ఖరారు చేయకపోవడంతో పనులు సకాలంలో పూర్తవుతాయా అనే అనుమానాలు రామ భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

20న కలెక్టర్ సమీక్ష

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాచలంలో 20న సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా అధికార యంత్రాంగంతో కలెక్టర్ ఈ సమీక్ష నిర్వహించడంతో పాటు ఏర్పాట్లకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అలాగే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించనున్నారు.

టీ హబ్‌ను పరిశీలించిన

డీఎంహెచ్‌వో



టీహబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలోని టి హబ్ (డయాగ్నస్టిక్ టెస్టింగ్ సెంటర్)ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.రామారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరచు మొరాయిస్తున్న మిషన్లపై ఆరా తీశారు. 'టీహబ్‌లో మొరాయిస్తున్న మిషన్లు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ఆయన దాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. సోమవారం కూడా మిషన్‌లో అంతరాయం ఏర్పడగా మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్‌తో మాట్లాడారు. టీహబ్‌లో ఎలాంటి అంతరాయాలు లేకుండా సేవలు అందించాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, పరీక్షల పనితీరును సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు వేగంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సెంటర్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, సిబ్బంది బాధ్యతలు, పరీక్షల వేగంపై సమగ్రంగా చర్చించడంతోపాటు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఖమ్మం అంబేద్కర్ సెంటర్ నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో వద్దిరాజు, తాతామధు

రాష్ట్రంలో కనుమరుగవుతున్న

నాణ్యమైన విద్య

- మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ ఆరోపణ
- సెంట్రల్ వర్సిటీ విద్యార్థినేత పాదయాత్రకు సంఘీభావం
- ఖమ్మం అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభం
- హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతామధు

7

పాలేరు జలాశయాన్ని సందర్శించిన

ఆనకట్ట భద్రతా నిపుణులు



పాలేరు జలాశయాన్ని సందర్శించిన డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం

కూసుమంచి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయాన్ని ఆనకట్ట భద్రతా నిపుణుల బృందం పరిశీలించింది. డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అశోక్‌కుమార్ గంజు ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఆనకట్ట భద్రత కోసం తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, శాశ్వత మరమ్మతులు కిందిస్థాయి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అథారిటీ సభ్యులు రామరాజు, ఎం.రాజు, సత్యనారాయణ, ఎస్ఈ సారంగం, డీఈ సతీష్, ఖమ్మం ఇరిగేషన్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ బానాల రమేష్‌రెడ్డి, డీఈ రత్నకుమారి, ఏఈలు శేఖర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం చివరి సోమవారం..

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

గోదావరికి నదీ హారతి సమర్పణ

ఆలయంలో దీపాలను వెలిగించిన

భద్రాద్రి రామాలయం ఈవో దంపతులు



గోదావరికి నదీ హారతులు సమర్పణ



శివాలయంలో లక్ష బిల్వార్చన

భద్రాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో చివరి సోమవారంను పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా భద్రాద్రి దేవస్థానంకు అనుబంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అంతకు ముందు ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అలాగే గోదావరికి నదీ హారతులను సమర్పించారు. కాగా సోమవారం రాత్రి శివాలయ ప్రాంగణంలో దీపాలను దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దంపతులు వెలిగించారు. అలాగే అనేక మంది భక్తులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా ప్రత్యేక పూజలు సైతం చేశారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు అయిలూరి సుబ్రమణ్యశర్మ, వేద పండితులు వేనూతుల ఆంజనేయవరప్రసాద్ శర్మ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాచలం గౌతమ బీ బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గోదావరికి కర్పూర హారతి సమర్పించారు. సౌత్ జోన్ ఐజీ టి.విక్రం, ఐటీడీవో పీవో రాహుల్ దంపతులు పలువురు ప్రముఖులు సోమవారం భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

అసమానతలు లేని విద్యావిధానం కావాలి

జిల్లా మహాసభలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



అంబేద్కర్ సెంటర్‌లో కళాకారుల ప్రదర్శనలు

మణుగూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభ మణుగూరులో కిన్నెర కళ్యాణ మండపంలో సోమవారం జరిగింది. తొలుత పలు కళాశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పీడీఎస్‌యూ డప్పు నృత్యకళాకారుల సారధ్యంలో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కిన్నెర కళ్యాణ మండపంలో జరిగిన మహాసభకు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో అసమానతలు లేని విద్యావిధానం అమలు కావాలని అందుకోసం విద్యార్థులు ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. పాలక ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం దేశానికి ప్రమాదకరమన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.9 వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడాలన్నారు. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ నాయకులు ఆర్ మధుసూధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ముద్దభిక్షం, కృష్ణ, మధుసూదన్‌రెడ్డి, సంధ్య, శివ ప్రశాంత్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటిన బీసీ సంక్షేమ పాఠశాల విద్యార్థులు





అండర్-14లో ప్రతిభ చాటిన విద్యార్థులు, గోల్డ్ మెడల్ సాధించిన రమ్య, సహస్ర

మణుగూరుటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లో ఆదివారం జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి యోగాసనం పోటీల్లో మణుగూరు మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అండర్ 14లో రిథమిక్ ఫెయిర్ క్యాటగిరీలో బహుమతులను సాధించారు. ఈ క్యాటగిరీలో కె.కౌశిక్, పి.శివకుమార్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లను పొందారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను ఖమ్మం జిల్లా ఆర్‌సీవో రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు మంజుల సురేష్, పీడీ వెంకట్రావ్‌లు అభినందించారు. కాగా అండర్ 17 విభాగంలో మణుగూరుకు చెందిన ఎం.రమ్య, బి.సహస్రలు గోల్డ్‌మెడల్ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ రాణి, ఆర్‌సీవో అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు మైనాల కావ్య, సరస్వతి, సుజాత, సునీతలు అభినందించారు.

కవితల పోటీల్లో భద్రాద్రి వాసికి ప్రథమస్థానం

భద్రాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విరించి సాహితీ పీఠం హైదరాబాద్ వారు నిర్వహించిన కవితల పోటీల్లో భద్రాచలంకు చెందిన న్యాయవాది, కవి సామరాజు తిరుమలరావు రాసిన అభ్యుదయం కవిత ప్రథమస్థానంలో నిలించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కవితల పోటీల్లో 270 మంది కవులు పాల్గొనగా తిరుమలరావు ప్రథమస్థానంలో నిలిచారు. దీంతో తిరుమలరావును భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, డీసీసీ అధ్యక్షుడే పొదెం వీరయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం అభినందించారు.

నిధుల్లేక నీరసం!

(5వ పేజీ తరువాయి)

మూడు మాత్రమే పూర్తిచేశారు. పనులు పూర్తయితే మరో 800మందికి ఉద్యోగవకాశాలు లభిస్తాయి

అదే ప్రాంగణంలో రెండోదశ నిర్మాణం..

ప్రస్తుతం ఐటీహబ్ ఉన్న స్థలంలోనే రెండోఫేజ్ పనులు చేపట్టారు. నిధులు కేటాయిస్తే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నిర్మాణాలను సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోతోంది. ఇటీవల టీహబ్ లో పనిచేస్తున్న ఉద్యోగులు, కంపెనీలతోనూ కాంగ్రెస్ నేత తుమ్మల యుగంధర్ సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు టీహబ్ రెండో దశ పనుల్లో ఏర్పడిన సమస్యను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం మొదటి ఫేజ్‌లో ఐటీ సర్వీస్ కంపెనీలు పలువురికి ఉపాధి చూపుతున్నాయి. ఇక్కడ స్థలం లేకపోవడంతో కొందరు ప్రైవేటు భవనంలో ఐటీ సర్వీస్ కంపెనీలను నిర్వహిస్తున్నారు. సెకండ్ ఫేజ్ పనులు పూర్తయితే 20కంపెనీలుపైగా తమ కార్యకలాపాలను నిర్వహించుకునే వీలుంటుందని టెక్ స్కై ఐటీ సొల్యూషన్ కంపెనీ ఎండీ బత్తినేనిప్రకాష్ తెలిపారు. తెలంగాణరాష్ట్రంలో జిల్లాల్లో ఉన్న ఐటీ హబ్‌లో ఖమ్మంఐటీ హబ్ విజయవంతంగా పనిచేస్తుందని, రెండో ఫేజ్ పనులు పూరిచేయడంతో ద్వారా స్థానికంగా అనేకమంది ఉద్యోగాలు లభిస్తాయన్నారు. దీంతోపాటు ఖమ్మంలో 5నుంచి10 ఎకరాల భూమి కేటాయించి ఐటీ పార్కు నిర్మిస్తే ప్రముఖ కంపెనీలు కూడా ఖమ్మంలో ఐటీకార్యకలాపాలు ప్రారంభించి ఉద్యోగావకాశాలు కలిపించే అవకాశం ఉంటుందన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇల్లెందు సివిల్ సప్లయీస్ డీటీ

(5వ పేజీ తరువాయి)

ఉన్న స్టాక్ కంటే తక్కువగా ఉందని, రేషన్ షాప్ సీజ్ చేయాల్సి ఉంటుందని, షాప్ సీజ్ చేయకుండా ఉండాలంటే తనకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆ తర్వాత డీటీ ఇచ్చిన ఆదేశాల మేరకు.. టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయ్ డబ్బు కోసం సదరు రేషన్ డీలర్‌పై ఒత్తిడి చేశాడు. దీంతో విసిగిపోయిన మహిళా రేషన్ డీలర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. పథకం ప్రకారం సోమవారం ఆ మహిళా డీలర్ రూ.30వేల నగదును ఇల్లెందు పట్టణంలోని జగదాంబసెంటర్‌లోని మొబైల్ షాప్‌లో రేషన్‌డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరీష్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడితో పాటు డీటీ యాకుబ్, ఆమెపై ఒత్తిడి తెచ్చిన టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌ను కూడా అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

గతంలో పట్టుబడ్డా.. మారని యాకుబ్ తీరు..

ఏసీబీకి పట్టుబడిన సివిల్ సప్లయీస్ డీటీ యాకూబ్‌పాషా గతంలోనూ అవినీతి కేసులో దొరికాడని, అయినా ఆయన తీరు మారలేదని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. 2011లో కొణిజర్ల మండలంలో ఓ వైద్యుడి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడని, ఆ కేసు ఇంకా కొనసాగుతోందని, ఈ క్రమంలోనే మళ్లీ పట్టుబడ్డాడని వివరించాడు. యాకుబ్ పాషాపై ఇల్లెందు, టేకులపల్లిలో అనేక ఫిర్యాదులు వచ్చాయని, అతనిపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారని వెల్లడించాడు. రేషన్ షాప్ తనిఖీలు చేయడం, చిన్న చిన్న సాకులతో బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం, డబ్బులు డిమాండ్ చేయడం ఆయనకు అలావాటుగా మారిందన్నారు.

ఉదయం అదృశ్యం.. సాయంత్రానికి ఆచూకీ లభ్యం

గురుకుల విద్యార్థినులు క్షేమం

పాల్వంచ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాల్వంచలోని బీసీ గురుకుల బాలికల హాస్టల్ నుంచి సోమవారం ఉదయం అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినుల ఆచూకీ సాయంత్రానికి లభించింది. ప్రిన్సిపాల్ అరుణ క్రాంతి కథనం ప్రకారం పాత పాల్వంచలోని మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల వసతిగృహంలోని 7వ తరగతి చదువుతున్న విద్యార్థినులు గండికోట సంజన, చంద్ర భావజ్ఞ ఉదయం హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా పారిపోయారు. ఉదయం రోల్ కా ల్ సమయంలో గుర్తించిన పీఈటీ వెంటనే ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్ అరుణక్రాంతి హుటాహుటిన హాస్టల్‌కు చేరుకు ని విచారణ చేసి విద్యార్థినులు పారిపోయినట్లుగా నిర్ధారణకు రావడంతో పాల్వంచ టౌన్ పోలీసులకు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న టౌన్ ఎస్ఐ సుమన్ హాస్టల్‌కు చేరుకుని ప్రాథమిక విచారణ చేసి రైల్వే పోలీసులను, గురుకుల విద్యాసంస్థల బాధ్యులను అప్రమత్తం చేశారు. ఉదయం మూడు గంటలకు హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన విద్యార్థినులు కొత్తగూడెం నుంచి రైలులో ప్రయాణించి సంజన స్వగ్రామమైన వరంగల్ చేరుకున్నారు. ఇదే క్రమంలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరిని సంజన మేనమామ గుర్తించి తన ఇంటికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థినులు వారి వారి ఇళ్లల్లో క్షేమంగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ అరుణక్రాంతి తెలిపారు. విద్యార్థిని చంద్ర భావజ్ఞది పాల్వంచ స్వగ్రామం.

నాణ్యత లేని చేప పిల్లలు మాకొద్దు..

ప్రారంభించేటప్పుడు పెద్దవి.. సరఫరాకు చిన్నవి

నాణ్యత పరిశీలించకుండానే సరఫరాకు అధికారుల అనుమతి

మత్స్యశాఖ అధికారులపై ఇల్లెందు ఎమ్మెల్యే కోరం ఆగ్రహం

తిరస్కరించి వెనక్కి పంపిన ఎమ్మెల్యే, మత్స్యకారులు



సైజులేని చేపల సరఫరాను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే, మత్స్యకారులు

కామేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాణ్యత, నిర్ణీతసైజు లేని చేప పిల్లలు తమకు వద్దంటు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మత్స్యకారులు సరఫరాను అడ్డుకుని వెనక్కి పంపించారు. సోమవారం కామేపల్లి పెద్ద చెరువులో చేపల విడుదల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా విడుదల చేశారు. కానీ చెరువులో వదిలిన చేప పిల్లలకు, సరఫరా చేసే చేప పిల్లలకు చాలా వ్యత్యాసం ఉంది. ఈ విషయన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గ్రహించి వెంటనే ఈ చేప పిల్లలను వెనక్కి పంపించేయండి అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు చిన్న చెరువులు, కుంటల్లో 35 నుంచి 40ఎంఎం సైజు చేప పిల్లలు సరఫరా చేయాలని, కానీ 20ఎంఎం సైజు కూడా లేవని నాణ్యతలేని చేప పిల్లలను ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు నాణ్యతలేని, తక్కువ సైజు గల చేప పిల్లలు అంటగట్టి లక్షలాది రూపాయాలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా మత్స్యశాఖాధికారి పట్టించుకోకుండా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతేకాక జిల్లా అధికారి ఇప్పుడు తీసుకోకపోతే మళ్లీరావని మత్స్యకారులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. గత నాలుగు నెలల క్రితమే మత్స్యకారులు సొంత డబ్బులు వెచించి ప్రైవేట్ ఫామ్‌ల్లో కొనుగోలు చేసి చెరువుల్లో వేసుకున్నారు. ఇప్పుడు అధికారులు వచ్చి చిన్న సైజుల చేప పిల్లలు పంపిణీ చేస్తే అవి ఎప్పుడు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నాణ్యమైన, నిర్ణీత సైజులో ఉన్న చేప పిల్లలను పంపిణీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు.

మహిళ అదృశ్యం : కేసు నమోదు

ఇల్లెందుటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యం అయ్యింది. సోమవారం ఇల్లెందు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ తాటిపాముల సురేశ్ కథనం ప్రకారం ఇల్లెందు పట్టణంలోని 14వ నెంబర్ బస్తీకి చెందిన ముత్యాల అరుణ ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి తన తల్లిగారింటికి మధిరకు వెళ్తున్నాని ఇరుగు పొరుగుకు వారికి చెప్పి వెళ్లింది. ఈ విషయం ఇంటిలోని భర్తకు గానీ, కుటుంబసభ్యులకు గానీ చెప్పకుండా వెళ్లిపోయింది. మరుసటి రోజు ఆమె భర్త ఎక్కడికి వెళ్లిందని వాకబు చేయగా ఆమె తల్లిదగ్గరకు గానీ ఇతర బంధువుల ఇంటికి గానీ వెళ్లలేదని తెలిసింది. నాలుగు రోజులైనా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ సురేశ్ తెలిపారు.

ఉపాధ్యాయులు బోధన నైపుణ్యం పెంచుకోవాలి

గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్



ప్రసంగిస్తున్న డీడీ అశోక్

భద్రాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్ను ఉపాధ్యాయులు తాము బోధించే సబ్జెక్టులకు సంబంధించి బోధన సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్ అన్నారు. భద్రాచలంలో సోమవారం స్థానిక బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఐదు రోజుల సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం ఈ ఐదు రోజల సామర్థ్య నిర్మాణ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులకు సులభంగా పాఠ్య పుస్తకాలు బోధించడానికి ఉపయోగపడుతుందని దీనిని ఉపాధ్యాయులందరూ చక్కగా ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరునాయక్, డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఏసీఎంవో రమేష్, ఎస్‌సీఆర్‌పీలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రామారావు

పాల్వంచ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హెచ్-142 రాష్ట్రఅధ్యక్షుడు కేవీ రామారావు జెన్కో యాజమాన్యాన్ని డిమాండ్ చేసారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెంజిల్లా పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 36 ఏళ్లుగా విద్యుత్ సంస్థల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించలేదన్నారు. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం రెండు ఏళ్లకు ఒకసారి జరగాల్సి ఉండగా యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో గుర్తింపు సంఘం తమదంటే తమదని ఎవరికి వారే ప్రకటించుకుని కార్మికుల సమస్యలను పక్కకు పెడుతున్నారని, యాజమాన్యాలు సైతం నచ్చినవారికి అనధికార గుర్తింపును ఇస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో హెచ్-142 ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించామని, కమిషనర్ ఆఫ్ లేబర్, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీలకు లేఖలను పంపిస్తున్నామన్నారు. సింగరేణి, ఆర్‌టీసీ, జీహెచ్ఎంసీ తదితర సంస్థల్లో క్రమం తప్పకుండా గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహిస్తున్నారని, ఈవిధానం విద్యుత్ సంస్థలకు ఎం దుకు వర్తించదని ప్రశ్నించారు. సమావేశంలో యూనియన్ నాయకులు శ్రీనివాసాచారి, సత్యరాజ్‌స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, సయ్యద్, టి.వెంకటేశ్వర్లు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అత్యధిక పరిహారం అందిస్తాం

బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో భూ సేకరణ

పరిహారం నిర్ధారణకు రైతులతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి చర్చ



నిర్వాసితులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీతారామ ఎత్తిపోతల పథకానికి భూ సేకరణకు నిర్వాసితులకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందిస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకంకోసం భూ సేకరణ పరిహారం రేటు నిర్ధారించేందుకు రైతులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూసర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించినట్లు తెలిపారు. బాజుమల్లాయిగూడెంలో ఎకరానికి రూ.2లక్షల 70 వేలు ఉందని, భూసేకరణ చట్టం ప్రకారం రెండింతలుగా రూ.5లక్షల 40వేలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.10లక్షల 80వేలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12శాతం వడ్డీ కింద రూ.64 వేలు కలిపి మొత్తం రూ.11లక్షల 44 వేలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి రూ.2లక్షల 92వేలు ఉందని, భూసేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ.5లక్షల 85 వేలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.11లక్షల 70వేలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12శాతం వడ్డీ కింద రూ.70 వేల 390లు కలిపి మొత్తం రూ.12లక్షల 40వేల 390లు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. 2022 నుంచి భూముల ధరల సవరణ జరగలేదని, భూముల ధరల సవరణ జరిగినా 10నుంచి 15శాతం కంటే ఎక్కువ పెరగదని, రైతులపట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ కలెక్టర్ ప్రతి ఏడాది 11 శాతం చొప్పున పెంచి ఎకరం విలువ రూ.3.59 లక్షలు అవుతుందని, వీటికి 4 రేట్లు పెంచి రూ.14.37లక్షలు, అదనపు విలువ పెంచితే రూ.14.50లక్షల వరకు మాత్రం పరిహారం ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చివరికి బాజుమల్లాయిగూడెం గ్రామ రైతులకు ఎకరానికి రూ.15లక్షలు, రేలకాయపల్లి రైతులకు ఎకరానికి రూ.16లక్షలు పరిహారం అందుతుందన్నారు. భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్లు, చెట్లు, ఇతర నిర్మాణాలకు విడిగా పరిహారం అందిస్తామని తెలిపారు. ముసాయిదా నోటిఫికేషన్ జారీచేసిన తేదీ ముందు నుంచి 3ఏళ్ల వరకు లావాదేవీలు పరిశీలించి సరాసరి ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులను అనవసరంగా మభ్యపెట్టి మోసం చేయాలనే ఉద్దేశం జిల్లా యంత్రాంగానికి లేదని, రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, చర్చించి సాధ్యమైనంత మేరకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ ఎకరానికి 35 నుంచి 40 లక్షల చొప్పున పరిహారం ఇప్పించాలని, భూములను కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని గోడు వెళ్లబోసుకున్నారు. భూమిలో ఉన్న పైప్ లైన్, చెట్లు, ఇతర పరికరాలు, డ్రిప్ సిస్టం వివరాలు సరిగ్గా నమోదు చేసి పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకుంటాం.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

(5వ పేజీ తరువాయి)

తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇక మంగళవారం కవిత ఖమ్మంలో పర్యటించనున్నారు.

ఎవరిపై విమర్శలొస్తే వారే స్పందించాలి..

జమలాపురం ఆలయం వద్ద మీడియాతో మాట్లాడిన కవిత.. హరీష్‌రావుపై విమర్శలు చేయవద్దంటూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఎవరిపై విమర్శలొస్తే వారే సమాధానం చెప్పాలి కానీ మరొకరు చెబితే సరిపోదన్నారు. ఇలాంటివి ప్రజలు కూడా గమనిస్తారన్నారు. పిల్లిమీద, పిట్టమీద పెట్టి వాళ్లతో వీళ్లతో తిట్టిస్తామంటే కుదరదని, ప్రజాక్షేత్రంలో అన్నిటికి సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం గురించి విలేకరులు ప్రస్తావించగా.. ఎక్కడ ఉపఎన్నిక జరిగినా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందని, కాంగ్రెస్‌పై కోపంగా ఉన్నా పథకాలు ఏ ఒక్కటీ అమలుకాకపోయినా ఓటర్లు కాంగ్రెస్‌కు ఓట్లేయడానికి ప్రధాన కారణం బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యమేనన్నారు. ప్రజా సమస్యలు ఎండగట్టడంలో ఆ పార్టీలు విఫలమయ్యాయని అందుకే తెలంగాణ జాగృతి విపక్ష బాధ్యత తీసుకుని ప్రజాసమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లే కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్యారంటీలు ఎందుకు అమలుచేయలేదని ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. జమలాపురం ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని గతంలో ఎన్టీఆర్, కేసీఆర్ ఈ ఆలయాన్ని సందర్శించారని, తనకు కూడా స్వామివారు ప్రజల సమస్యలు తీర్చే శక్తినివ్వాలని కోరుకున్నానని తెలిపారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారితో ఆలయం అభివృద్ధి చేయడం గొప్పవిషయమన్నారు. అనంతరం మధిర లెదర్‌పార్కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, పరిశ్రమ ఏర్పాటులో జాప్యంపట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. పెనుబల్లి మండలంలోని మోడల్‌స్కూల్ సందర్శించి హాస్టల్ భవనం పెచ్చులూడి ప్రమాదకరంగా ఉండటం గమనించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు ఇటీవల భోజనంలో బొద్దింకలు, పురుగులు వచ్చినందున విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని కవిత పేర్కొన్నారు.



సీతారామ టన్నెల్ పనుల గురించి వివరాలు అడిగి తెలుకుంటున్న కవిత

సీతారామపనుల్లో జాప్యంపై వ్యాఖ్యలు

సత్తుపల్లి మండలం యాతాలకుంటలో పర్యటించిన కవిత సీతారామ ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజీ టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఖమ్మంజిల్లాలో 3 లక్షల ఎకరాలకు నీరిచ్చేందుకు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ డిజైన్ చేశారని, ప్రాజెక్టునిర్మాణంలో జాప్యం జరుగుతోందన్నారు. అయితే సత్తుపల్లి టన్నెల్ పనులు ఆశాజనకంగా జరుగుతున్నాయని, మిగతా పనులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడి 12ఏళ్లవుతున్నా రైతులకు అందాల్సిన ఫలాలు అందకపోవడం అన్యాయమన్నారు. రూ. 7 కోట్లతో మొదలైన సీతారామపనుల అంచనాలు రూ.19కోట్లకు పెరిగాయని, పనులను సత్వరం పూర్తిచేసేందుకు మంత్రి తుమ్మల కృషిచేయాలని కోరారు.

జేవీఆర్ ఓసీ సందర్శన

సత్తుపల్లి వెంగళరావు నగర్‌లోని జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ మైన్‌ను సందర్శించి.. ఇక్కడ పర్మినెంట్ ఉద్యోగుల కంటే కాంటాక్టు ఉద్యోగులు ఉన్నారని వారిని పర్మినెంట్‌చేయాలని డిమాండ్ చేశారు. కేవలం లాభాలపై దృష్టిపెట్టిన సింగరేణి కార్మికుల భద్రత, ఇన్సూరెన్సు గురించి పట్టించుకోవడంలేదని, సింగరేణి కార్మికుల సమస్యలపై హెచ్ఎంఎస్, జాగృతి కలిసి ఐక్య ఉద్యమాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లలో డిపెండెంట్ ఉద్యోగాలు లేకుండా చేసిందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై ఈ నెల 19న హైదరాబాదులో సింగరేణి భవన్ ముట్టడిస్తామని కార్మికుల పక్షాన పోరాడతామని తెలిపారు. ఇన్‌కంట్యాక్స్ కారణంగా కార్మికులు పెద్దఎత్తున నష్టపోతున్నారని తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కృషిచేయాలని తెలిపారు. సింగరేణిలో ఏరియా ఆసుపత్రి నిర్వాహణ అధ్వాన్నంగా ఉందని, ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కలిపించాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఉన్నట్టుగానే సింగరేణి కార్మికులకు ప్రత్యేక ఆసుపత్రి హైదరాబాదులో ఏర్పాటుచేయాలన్నారు. కార్మికులు తెలంగాణ జాగృతిలకు అండగా నిలవాలని, గతంలో కేసీఆర్ అనేక మార్పులు తీసుకొచ్చారనని, కొంతశ్రమపడి కొంతమందికి ఉద్యోగాలు ఇప్పించుకోగా అవి కొనసాగలేదన్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించాలి

తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో పర్యటించిన కవిత జాగృతి రాష్ట్రనాయకుడు షేక్ హుస్సేన్ ను పరామర్శించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆమె ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న యాసంగి ధాన్యం బోనస్ డబ్బులను రైతులు ఖాతాల్లో వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు త్వరగా జరిగేలా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల చొరవతీసుకోవాలని కోరారు.

పత్తి రైతుల పరేషాన్!



జిన్నింగ్ మిల్లు వద్ద మిల్లర్లు కొనుగోలు చేసిన పత్తి

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తుండటంతో పత్తి రైతులు తెల్లబోతున్నారు. అంతే కాకుండా పత్తికి మద్దతు ధర లభిస్తుందని మార్కెట్‌కు పోతే దళారీలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్ట పోతున్నారు.

పత్తిరైతులకు తీవ్ర నష్టాలు..

పత్తికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాలు రూ.8,110 పొందొచ్చనే ఆశతో ఉమ్మడి జిల్లాలో గత నెలలో ప్రారంభమైన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన జిన్నింగ్ మిల్లుల వద్దకు పోతే అక్కడ వారు ఏవేవో వంకలు పెడుతూ కొనుగోలు చేయట్లేదని, తరుగు తీస్తేనే కొనుగోలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల రగడ తోడై రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల సమ్మె సైరన్ మోగడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు విలవిలలాడుతున్నారు. జిన్నింగ్ మిల్లుల సమ్మె ఒక వైపు, ప్రైవేటులో ధర దక్కక మరోవైపు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో సుమారు 2 లక్షల 49 వేల ఎకరాలలో పత్తి పంట సాగు కాగా దిగుబడి 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల క్వింటాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 2 లక్షల 21 వేల ఎకరాలలో పంట సాగు చేయగా 2 లక్షల 6 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యసాయ శాఖ అంచనా ఉంది. దానికి తగ్గట్టు కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, జిన్నింగ్ మిల్లుల సమ్మె తదితర అంశాలు పత్తి రైతుల ఆశలపై నీళ్ళు చల్లినట్టుగా ఉందని రైతులు వాపోతున్నారు

మా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది

వేముల సతీష్, కొదుమూరు, చింతకాని మండలం

ఈ ఏడాది అధిక వర్షాలు వచ్చి పత్తి రైతులు దారుణంగా దెబ్బతిన్నారు. మా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇక వచ్చిన అరకొర పత్తిని ఎమ్మెస్పీకి అమ్ముకుందామంటే జిన్నింగ్ మిల్లుల వద్ద క్యారీలు, రెండు మూడు రోజులు పని చెడగొట్టుకొని ఉండాల్సి రావడం శాపాలుగా మారాయి. ఇక ప్రైవేటు వ్యక్తులు తక్కువ ధరకు అడుగుతుండటంతో పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. అధికారులు కానీ ప్రభుత్వం పంటలను మద్దతు ధరకు కొనే విషయంలో పక్కా ప్రణాళికలు రూపొందించాలి. రైతులను ఇబ్బంది పెట్టకుండా ఉండేలా నిబంధనలు తీసుకురావాలి.

రాష్ట్రంలో కనుమరుగవుతున్న నాణ్యమైన విద్య


» మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ ఆరోపణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఖమ్మం మార్కెట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో నాణ్యమైన విద్య కనుమరుగైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఎద్దేవా చేశారు. సోమవారం నగరంలోని జడ్పీ సెంటర్‌లో హైదరాబాద్ సెంట్రల్ వర్శిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తా పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 9 నెలలుగా రాష్ట్రంలోని కళాశాలల ఉద్యోగులకు జీతాలివ్వలేక, పిల్లలకు చదువు చెప్పలేక కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండి విద్యాశాఖను పూర్తిగా గాలికొదిలేసిందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేస్తున్న విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తాను వారు అభినందించారు. కార్యక్రమంలో గుండాల కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బొమ్మా రాజేశ్వరరావు, బిచ్చాల తిరుమలరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ గుర్తుండిపోయేలా..



» వెండితెరపైకి 'వనజీవి' జీవితం » ఈనెల 21న ఖమ్మంలో చిత్ర షూటింగ్ ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కోటి మొక్కల రామయ్యగా.. వనజీవి రామయ్యగా ప్రసిద్ధుడైన రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దరిపల్లి రామయ్య గురించి తెలియని వారుండరు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ఆయనదో ప్రత్యేక శైలి. వృక్షో రక్షతి రక్షితః అన్న నినాదాలు రాసి ఉన్న గుండ్రని ప్లకార్డును తగిలించుకొని.. మోపెడ్‌పై ఊరూరా తిరుగుతూ ఆయన చేసిన పర్యావరణ పరిరక్షణ ప్రచారం అందరికీ తెలిసిందే. ఇక శుభకార్యాలకు హాజరైన సందర్భాల్లో మొక్కలను బహుమతులుగా అందించడం ఆయన ప్రత్యేకం. అలాగే వివిధ చెట్ల నుంచి గింజలను సేకరించి అటవీప్రాంతాల్లో, ఖాళీ స్థలాల్లో చల్లడం ఆయనకు అలవాటు. అలాంటి రామయ్య ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకృతి ఒడిలో ఒదిగిపోయారు. తన తుది శ్వాస వరకు పర్యావరణం కోసమే తపించిన వనజీవి చరిత్ర అందరికీ గుర్తుండిపోయేలా ఆయన జీవిత చరిత్ర ఇప్పుడు వెండితెరపైకి ఎక్కిస్తున్నారు ప్రకృతి పరిరక్షణ ఫిలిమ్స్ వారు. ఆయన జీవిత చరిత్రే కథాంశంగా చలనచిత్రాన్ని (డాక్యుమెంటరీ) తీయబోతున్నారు. దీనికి సంబంధించిన వివరాలను చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న వేముగంటి, సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మాతగా నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ రామయ్య పాత్రలో నటిస్తున్నారని తెలిపారు. ఈ నెల 21న ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలోని నేచర్ వ్యాలీలో చిత్రీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. కోటి మొక్కలు నాటిన దరిపల్లి రామయ్య జీవిత చరిత్ర భావి తరాలకు తెలియజేసి స్ఫూర్తిని కలిగించాలనే ఉద్దేశ్యంతో ఈ చిత్ర నిర్మాణం చేపట్టామని, మొక్కల ప్రేమికుడు, ప్రకృతి సహవాసి రామయ్యకు నివాళిగా చిత్రాన్ని సమర్పిస్తున్నామని తెలిపారు.

ఖమ్మం నగరం బల్లేపల్లికి చెందిన మోహన్ వనజీవి రామయ్య చిత్రానికి సంగీతం అందిస్తున్నారన్నారు. ఈ నెల 21, 22, 23 ఖమ్మం పరిసర ప్రాంతాలలో షూటింగ్ పూర్తి చేసిన అనంతరం పూర్తి షూటింగ్ హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ పలువురు సీనియర్ నటులతోపాటు, వనజీవి రామయ్యకు సన్నిహితులు కొందరు నటిస్తారని తెలిపారు. అయితే వనజీవి రామయ్యకు జీవితంలో జరిగిన ప్రధాన సంఘటనలను ఇందులో చూపుతున్నామని, ఈ నేపథ్యంలోనే ఇటీవల రామయ్య జీవిత విశేషాలతో తమ ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేశామన్నారు.

ఎన్నో ప్రశంసలు.. అవార్డులు

రామయ్య సేవలను గుర్తించి ప్రశంసిస్తూ.. 2000 సంవత్సరంలో నాటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు రామయ్యకు ఒక మోపెడ్‌ను(ద్విచక్ర వాహనాన్ని) బహుమతిగా అందించారు. చాలా ఏళ్లు రామయ్య ఆ మోపెడ్‌పైనే ఊరూరా తిరిగారు. ఇక రామయ్య ఆదర్శ జీవితాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగులో, తెలంగాణ ప్రభుత్వం 6వ తరగతి సాంఘికశాస్త్రంలో పాఠ్యాంశంగా చేర్చాయి. 1995 లో భారత ప్రభుత్వంనుంచి వనసేవా అవార్డు అందుకున్న రామయ్య, యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు. ఖమ్మం రోటరీ క్లబ్ అవార్డుతోపాటు 2005 సంవత్సరానికి సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి వనమిత్ర అవార్డు అందుకున్నారు. 2017 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. కోటి మొక్కలు నాటి వన కోటీశ్వరుడిగా ఖమ్మం ఖ్యాతిని ఇనుమడింపజేసిన రామయ్య తన 87వ ఏట ఏప్రిల్ 2025లో ప్రకృతి ఒడిలోకి ఒదిగిపోయారు. ఈ అంశాలను కలగలుపుతూ చిత్రం రూపుదిద్దుకోనుంది. 21న జరిగే ఈ చిత్ర ప్రారంభానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో నగరవాసికి గోల్డ్‌మెడల్



లక్ష్మి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత కంఠస్థ పోటీలలో ఖమ్మం నగరం చైతన్యనగర్‌కు చెందిన కట్టా లక్ష్మీ గోల్డ్ మెండల్ సాధించింది. మైసూర్ దత్త పీఠం వారు గత నెలలో నిర్వహించిన పోటీల ఫలితాలను సోమవారం విడుదల చేయగా లక్ష్మికి పోటీలలో మొదటి స్థానం పొంది గోల్డ్‌మెడల్ సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ గోల్డ్ మెడల్‌ను డిసెంబరు 1న జరిగే కార్యక్రమంలో అందిస్తారని తెలిపారు. సంపూర్ణ భగవద్గీత పోటీలలో 18 అధ్యాయా లు, 700ల శ్లోకాలు కంఠస్థం చేసి ఉత్తమ శ్రేణిలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన లక్ష్మీని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కోచ్ నగేష్

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 16న జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఆర్చరీ పోటీలలో నగరానికి చెందిన రామ్‌చరణ్ సత్తా చాటి స్వర్ణ పతకం సాధించాడు. సర్దార్ పటేల్ స్టేడియంలో ఖేలో ఇండియా ఆర్చరీ సెంటర్‌లో నిత్యం సాధన చేసేరామ్‌చరణ్ ఇటీవల పలు రాష్ట్ర, జాతీయ పోటీలలో ప్రతిభ చూపుతుండటం విశేషం. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారుడిని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కోచ్ నగేష్, ఆర్చరీ సంఘం బాధ్యులు అభినందించారు.

నేటి నుంచి కిన్నెరసానిలో ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ క్రీడలు



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న క్రీడా అధికారులు

పాల్వంచ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిన్నెరసానిలో గల ఆదర్శ క్రీడా పాఠశాలలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి జోనల్ క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఐటీడీఏ క్రీడల అధికారి బి. గోపాల్‌రావు క్రీడా మైదానాలను పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో గల ఏడు జోనల్ పాఠశాలలో గల విద్యార్థిని విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట ఏఎస్‌వోలు కె. వెంకటనారాయణ, నాగేశ్వరరావు, హెచ్‌ఎం బీ. శంకర్, పీడీలు ఏ. నగేష్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ద్వితీయ బహుమతి

తిరుమలాయపాలెం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని కేజీబీవీలో 9వరతగతి చదువుతు దీక్షా రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్‌లో ద్వితీయ బహుమతి సాధించింది. ఈనెల 14నుంచి 16వరకు సికింద్రాబాదులో జరిగిన పోటీల్లో దీక్షా ద్వితీయస్థానం సాధించింది. కాగా సోమవారం దీక్షను ఎంఈవో శ్రీనివాస్, ఎస్‌వో రమాకుమారి, పీఈటీ సుబానా తదితరులు అభినందించారు.



విద్యార్థి దీక్షను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

» ప్రథమస్థానంలో ఖమ్మం బాల, బాలికల జట్టు



గుర్తూర్ మోడల్ పాఠశాలలో బహుమతులు అందుకుంటున్న విజేతలు

తొర్రూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తూర్ మోడల్ స్కూల్‌లో మూడు రోజుల పాటు అండర్-19 విభాగంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ఐ నెట్‌బాట్ రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ఈ క్రీడల్లో రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గత మూడు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీల్లో చివరి రోజు బాలుర విభాగంలో హైదరాబాద్-ఖమ్మం జట్లు పోటీ పడగా ఖమ్మం జట్టు విజేతగా నిలువగా, బాలికల విభాగంలో వరంగల్-ఖమ్మం జట్లు పోటీ పడగా ఖమ్మం జట్టు విజయం సాధించారు. విజేతలకు తొర్రూరు ఎంఈవో బుచ్చయ్య బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పరిశీలకుడు సమ్మయ్య, కో-ఆర్డినేటర్ రమణ, సీహెచ్.ఐలయ్య, పీడీలు కొప్పుల శంకర్, ప్రభాకర్, వరప్రసాద్, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేశ్, చంద్రబాను, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కొత్తగూడెం లీగల్/చంద్రుగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదీ, రూ.10 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (పోక్సో స్పెషల్ న్యాయాధికారి అదనపు ఇన్‌చార్జి) ఎస్. సరిత మంగళవారం తీర్పు చెప్పారు. ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుగొండ మండ లంలోని ఓ గ్రామానికి చెందిన సయ్యద్ లాలు, అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సహకారంతో బాధిత బాలిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రవి అతడిపై పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం అతడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రెండు వేర్వేరు కేసుల్లో ఒకే వ్యక్తికి ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పట్టణానికి చెందిన కోట్ల వెంకటరామాకుమార్ అనే నిందితునికి రెండు వేర్వేరు చెల్లని చెక్కు కేసుల్లో జైలు శిక్షతో పాటు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరం టేకులపల్లికి చెందిన సంకూరు రాముతో పాటు ఖమ్మం నగరం రోటరీనగర్‌కి చెందిన కనగంటి సైదులు వద్ద నిందితుడు రూ.15లక్షలు, 16 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కాగా వారు ఇటీవల రుణం చెల్లించమని అడగగా 2017లో కొంత నగదుపై చెక్కు ఇచ్చాడు. ఫిర్యాదులు ఆ చెక్కులను వారి బ్యాంక్‌లలో జమ చేయగా చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాదులు తమ న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో వేర్వేరుగా ఆరు నెలల శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఖమ్మం క్రైం నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొద్దింకల మందు తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ నందు సోమవారం కేసు నమోదైంది. నగరంలోని కవిరాజ్‌నగర్‌కు చెందిన హరి సుజాత(64) అనే వృద్ధురాలు కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతుంది. దీంతో గత నెల 13న ఇంట్లో బొద్దింకల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపా

హడలెత్తిస్తున్న చోరీలు

» తాళం వేసి ఉన్న ఇళ్లే ప్రధాన లక్ష్యం
» మూడేళ్లుగా పట్టుబడని దొంగలు..
» ఆందోళనలో గ్రామాల ప్రజలు

జూలూరుపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు. మూడేళ్లుగా వరుస దొంగతనాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చోరీలు భయాందోళనలకు గురిచేస్తున్నాయి. విద్యుత్ మోటర్లు, పంట చేలల్లో పత్తి, మిర్చి, మేకలు, ద్విచక్ర వాహనాలు కావేవి చోరీలకు అనర్హమన్నట్టుగా దొంగిలిస్తూ దొంగలు చెలరేగిపోతున్నారు. పోలీసులు మాత్రం దొంగలను పట్టుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లుగా, నిఘా నేత్రం నిద్రపోతున్నట్లుగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జూలూరుపాడు మండలంలో పలు గ్రామాలలో తరచూ దొంగతనాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. తాళాలు వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. వీటిని అరికట్టడంలో పోలీసు శాఖ చేతులెత్తేసిందని ప్రజలు అంటున్నారు. గత మూడేళ్లుగా చోరీలు జరుగుతున్నప్పటికీ నేటి వరకు పోలీసులు కేసులను ఛేదించకపోవడం విస్మయం కల్గిస్తోంది. కొన్ని దొంగతనాలకు సంబధించి సీసీ ఫుటేజీలు లభించినప్పటికీ దొంగలను గుర్తించక పోవడం పట్ల పోలీసులు విమర్శల నెదుర్కొంటున్నారు.



మాచినేనిపేటతండాలో విచారణ చేపడుతున్న జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి (ఫైల్)

మండలంలో 2023 నుంచి అక్టోబరు 2025 వరకు సుమారు 22 చోరీలు జరిగినట్టు పోలీసులు అధికారికంగా కేసులు నమోదు చేశారు. ఇవి కాకుండా మరికొన్ని దొంగతనాలు జరిగాయి. పడమటనర్సాపురం, మాచినేనిపేట తండా, కొమ్ముగూడెం, జూలూరుపాడు, గుండెపుడిలలో అత్యధికంగా దొంగతనాలు చోటుచేసుకున్నాయి. ఈ మూడేళ్లలో 22 దొంగతనాలలో రూ. 30 లక్షల సొత్తుతో పాటు బంగారం, వెండి వస్తువులను దొంగలు అపహరించారు. వీటితో పాటు చిల్లర దొంగతనాలతో మరో రూ. 20 లక్షలు దోచుకోవడం జరిగింది. 2023లో 5 చోరీల కేసులు నమోదు కాగా బంగారం, నగదుతో కలిపి రూ 12.81 లక్షలు చోరీకి గురైనట్టు పోలీసులు గుర్తించారు.

ఇవే కాకుండా గుండెపుడి, గాంధీనగర్, పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం గ్రామాల్లో విద్యుత్ మోటర్లు, మేకలు, చేలల్లోని పత్తి, మిరప పంటలను దోచుకెళ్లారు. ఈవరస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న మండల ప్రజలు ఏ రోజు ఎవరింట్లో ఏమి జరుగుతుందోనన్న భయాందోళనలతో రాత్రి వేళ చీమ చిటుక్కుమన్నా ఉలిక్కిపడుతున్నారు. భయంతో వణికిపోతున్నారు.

మండలంలో జరుగుతోన్న వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ప్రజలకు చెందిన లక్షలాది రూపాయిల సొత్తు దొంగల పరం కావడం జీర్ణించుకోలేక పోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో కేవలం గుండెపుడి పత్తి చేలో పత్తి బస్తాలను చోరీచేసిన దొంగలను మాత్రమే పోలీసులు గుర్తించడం జరిగింది. మిగతా కేసులకు సంబంధించి దొంగల ఆచూకీ కనిపెట్టి కేసులను ఛేదించడంలో పోలీసులు, నిఘా విభాగం విఫలం చెందడం విమర్శలకు తావిస్తోంది.



మాచినేనిపేటతండాలో ఓ ఇంట్లోని బీరువా పగులగొట్టి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లిన దృశ్యం(ఫైల్)

చోరీలు జరిగిన సమయంలో వేలిముద్రలను సేకరించి హడావుడి చేసి ఆ తర్వాత దృష్టి సారించడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు, నిఘా విభాగం దృష్టి సారించి కేసులను ఛేదించి చోరీకి గురైన సొత్తును రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

త్వరలోనే కేసులను ఛేదిస్తాం

● శ్రీలక్ష్మి, జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్



మండలంలో చోరీల కేసులను ఛేదించే విధంగా చర్యలు తీసుకుంటాం. పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. దొంగలను పట్టుకుని బాధితులు కోల్పోయిన సొత్తును రికవరీ చేసి అందించేల కృషి చేస్తాం. దొంగల ముఠాలు తాళాలు వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా ఎంచుకుని చోరీలకు పాల్పడుతుండటంతో ప్రజలు పండుగలు, శుభకార్యాలకు వెళుతున్నప్పుడు ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం అందించాలి. ఆభరణాలు, నగదును తమ వెంట తీసుకువెళ్లాలి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి గాయాలు

తిప్పనపల్లిలో నలుగురికి...

చంద్రుగొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిప్పనపల్లిలో సోమవారం వేరు వేరుగా రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. తిప్పనపల్లి ప్రధాన సెంటర్‌లో ఆగిఉన్న బొగ్గు టిప్పర్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న అదే గ్రామానికి చెందిన సయ్యద్ మైమూద్, ఎస్. యాకుబ్‌పాషా, బాబు, ఆఫీజ్‌లకు గాయాలయాయి. ఈ నలుగురు యువకులు చంద్రుగొండ శివారు ఇందిరానగర్‌లో జరిగిన వివాహవేడుకలకు హాజరై ఇంటికి(తిప్పనపల్లి)కి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గాయాలయిన యువకులను 108లో కొత్తగూడెం తరలించారు.

మూడు గేదెలు మృతి...

తిప్పనపల్లి గ్రామశివారులో సోమవారం ఉదయం నాగులు గేదెలను బొగ్గు టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు మృతి చెందగా మరో గేదెకు తీవ్ర గాయాలయాయి. తిప్పనపల్లి తండాకు చెందిన కేలోత్ రాములు తన నాలుగు గేదెలను ఆదివారం సమీపంలోని అడవికి మేతకు తోలగా అవి తప్పిపోయి సోమవారం ఉదయం ఇంటికి వస్తున్న క్రమంలో బొగ్గుటిప్పర్ గేదెలను ఢీకొంది. వీటి విలువ రూ. 3.50 లక్షలు ఉంటుందని యజమాని రాములు తెలిపాడు.

రేజర్లలో ఇరువురికి...

సత్తుపల్లిరూరల్: ఆటో, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన సత్తుపల్లి మండలం రేజర్లలో చోటుచేసుకుంది. 108సిబ్బంది ఈఎంటీ గొల్లమందల కృష్ణ, పైలెట్ రాధాకృష్ణలు తెలిపిన వివరాల ప్రకారం.. వేంసూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన పల్లెపోగు సురేష్ ఆటోలో, నడ్డి రవిలు బైక్‌పై వస్తూ రేజర్ల వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి అదేసమయంలో అటువైపుగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఇరువురికి ప్రథమ చికిత్స అందించి సత్తుపల్లికి తరలించారు. కాగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఒకవైపు వడ్లు ఆరబోయడం, కాటా వేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

కార్తీక సోమవారం పూజల్లో అపశ్రుతి

» ఇద్దరు మహిళలకు అంటుకున్న మంటలు
» అభిషేకం కోసం నీళ్లనుకుని థిన్నర్ చల్లడంతో ప్రమాదం
» భద్రాద్రి జిల్లా నరసాపురం కృష్ణుడి గుడిలో ఘటన

దుమ్ముగూడెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):నరసాపురం చినఅరుణాచలం ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా విషాదం నెలకొంది. పూజా కార్యక్రమాల్లో భాగంగా పొరపాటున నీళ్లుగా భావించి మండే స్వభావం గల థిన్నర్ ద్రావకాన్ని వినియోగించడంతో మంటలంటుకొని ఇద్దరు మహిళా భక్తులకు తీవ్రగాయాలవగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కార్తీకమాసంలోని చివరి సోమవారం సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. సరిహద్దు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూనవరానికి చెందిన ఏడుగురు మహిళా భక్తుల బృందం పూజలు నిర్వహించేందుకు నరసాపురం చిన అరుణాచలానికి వచ్చారు. అంతరాలయమైన కృష్ణుని గుడి వద్ద దీపాలు వెలిగించేందుకు ఉపక్రమించారు. పూజలో భాగంగా దీపాలు వెలిగించిన తర్వాత జలాభిషేకం చేయాలనే ఉద్దేశంతో నాచుపల్లి కృష్ణవేణి అనే భక్తురాలు విగ్రహాల వెనుక ఉన్న సీల్డు థిన్నర్ బాటిల్‌ను నీటి సీసాగా భావించి మూత తీసి దీపాలపై చల్లారు. మంటలు మీదకు ఎగిసిపడడంతో వాటిని చల్లార్చే ఉద్దేశంతో మరోమారు థిన్నర్ సీసాను తన ఒంటిపై పోసుకున్నారు. దీంతో మంటలు చెలరేగి బృందంలోని ఆమెతో పాటు పుట్టి ఈశ్వరమ్మలు గాయపడ్డారు. బృందంలోని మిగతా వారంతా క్షేమంగా ఉన్నారు. పరిసరాల్లోని యాంప్లిఫైయర్‌కు కూడా మంటలు వ్యాపించడంతో ఒక అర్చకులు దాన్ని తీసి దూరంగా విసిరేయడంతో ప్రమాద తీవ్రత తగ్గినట్లుగా తెలుస్తోంది. తొలుత వీరిని నరసాపురం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కృష్ణవేణి తీవ్రంగా గాయపడడంతో పరిస్థితి ఒకింత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

» ఉద్రిక్తల నడుమ నిర్మాణాల కూల్చివేత
» ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయింపు
» ఆదుకోవాలంటూ నిర్వాసితుల వేడుకోలు

అశ్వారావుపేట రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు సోమవారం తెల్లవారుజామున ఎక్స్‌కవేటర్ల తొలిగించారు. తొలగింపు సమయంలో పేదలకు, అధికారులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. గుడిసెల తొలిగింపు నేపథ్యంలో సీపీఐ నాయకులను పోలీసులు ముందస్తుగానే అరెస్ట్ చేశారు. అశ్వారావుపేట పట్టణంలో ఖమ్మం రోడ్‌లో కెమిలాయిడ్స్ గెస్ట్ హౌజ్ సమీపంలో దాదాపు రెండు ఎకరాల్లో సీపీఐ ఆధ్వర్యంలో రెండున్నర ఏళ్ల క్రితం దాదాపు 150మంది వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇదే సమయంలో ప్రభుత్వం అశ్వారావుపేట ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయగా అధికారులు స్థల సేకరణ చేపట్టారు. ఖమ్మం మార్గంలోని పట్టుపరిశ్రమకు చెందిన దాదాపు 19 ఎకరాల భూమితో పాటు ఆక్రమిత భూమి కూడా అవసరం అయింది. పాఠశాల నిర్మాణానికి దాదాపు 25 ఎకరాల భూమి అవసరం కావటంతో అధికారులు పేదలు వేసుకున్న గుడిసెలను తీసివేయాలని నోటీసులు జారీ చేశారు. అయితే స్థల ఆక్రమణదారులు ఇళ్లను తొలిగించకపోవటంతో సోమవారం రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కూల్చివేతలు చేపట్టింది. కార్యక్రమానికి ముందుగానే సీపీఐ జిల్లా నాయకులు సలీంతో పాటు మరికొంత మంది నాయకులను అరెస్ట్ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో తొలిగింపులు చేపట్టారు. ఒక్కసారిగా తాము నివాసం ఉంటున్న ఇళ్లను తొలిగిస్తుండటంతో పేదలు వాగ్వాదానికి దిగారు. ఒక్కసారిగా తమ నివాసాలను తొలిగిస్తే ఎలా ఉండాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొనగా పోలీసులు అక్కడ ఉన్న నాయకులను కూడా అరెస్ట్ చేసి దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. అధికారులు గుడిసెల తొలిగింపు సమయంలో కొంత ఇంటి సామాగ్రి కూడా ధ్వంసం అయింది. తొలిగింపుల అనంతరం మిగిలిన సామాగ్రిని పేదలు తీసుకెళ్లారు. ఇదే విషయమై అధికారులు మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి స్థలం అవసరం అయిందని, ఆక్రమణలు ఖాళీచేయాలని గతంలోనే నోటీసులు ఇచ్చామని అయినా స్పందన లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఆక్రమణలు తొలిగించటం జరిగిందని తెలిపారు. ఆక్రమణల తొలిగింపులో సీఐ నాగరాజు, ఎస్‌ఐ యయాతిరాజు, సాయి కిషోర్‌రెడ్డి, అఖిల, తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.



ట్రాక్టర్లపై సామగ్రిని వేసుకుని వెళుతున్న నిర్వాసితులు



గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం



రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన ఏడీసీపీ

రఘునాథపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందటంతో ప్రమాద ప్రాంతాన్ని అడిషనల్ డీసీపీ ప్రసాదరావు పరిశీలించారు. కొణిజర్ల మండలం ఉప్పలకచెలకు చెందిన కూలీలు రెండు ఆటోల్లో పత్తి తీసేందుకు రఘునాథపాలెం మండలం రహదారి నుంచి తిరుమలాయపాలెం చంద్రుతండాకు ఆదివారం వెళ్లారు. కూలీ పనులు ముగించుకొని తిరిగి రాత్రి సమయంలో వస్తుండగా రఘునాథపాలెం మండలం ఈర్లపుడి వద్ద ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఆటోలోని ఎనిమంది కూలీలకు గాయాలు కాగా జిల్లా ప్రభుత్వ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ అయిన బోడనాగమ్మ(44) సోమవారం కన్నుమూశారు. దీంతో అడిషనల్ డీసీపీ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.



రోడ్డుపై పత్తి ట్రాక్టర్లతో రాస్తారోకో చేస్తున్న రైతులు

పత్తిట్రాక్టర్లతో రైతుల రాస్తారోకో

ఖమ్మంరూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడులోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లు ఎదుట రైతులు పత్తి వాహనాలతో ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గుర్రాలపాడులోని సీసీఐ ఆధ్వర్యంలోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లులో రైతులు పత్తి విక్రయించుకునేందుకు మొత్తం79మంది రైతులు ముందుగా బుక్ చేసుకున్నారు. సోమవారం 16మంది రైతులు ట్రాక్టర్లు, ఆటోల్లో జీఆర్ఆర్ మిల్లుకు పత్తిని తీసుకువచ్చారు. మిల్లు బంద్ చేసి ఉందని రెండురోజుల తరువాత తీసుకురావాలని సిబ్బంది సూచించారు. దీంతో రైతులు ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై పత్తి వాహనాలను అడ్డంగా పెట్టి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, సెక్రటరీ ప్రవీన్‌కుమార్, మార్కెటింగ్ శాఖ అధికారి అంజనేయులు వెంటనే మిల్లు వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు బంద్ చేపట్టాయని, దీంతో జిల్లాలో కూడా జిన్నింగ్ మిల్లులు బంద్‌కు మద్దతు ఇచ్చాయన్నారు. రైతులు ఇబ్బందిపడాల్సిన పనిలేదని పత్తిలోడ్లను మిల్లులో పాస్ చేయించారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు.



కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ముగిసిన పెన్షనర్ల దీక్షలు

ఖమ్మంఅర్బన్,నవంబరు17(ఆంధ్రజ్యోతి):రిటైర్డ్‌బెనిఫిట్స్, తదితర పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులు చేపట్టిన రిలేనిరహార దీక్షలు సోమవారం ముగిశాయి. 2024 తరువాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్, తదితర ప్రయోజనాలను నెరవేర్చాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వారం రోజులుగా కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలను నిర్వహించారు. సోమవారం జరిగిన ముగింపు దీక్షలకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి హాజరై ప్రసంగించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఏ ఒక్కటీ అందక పోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రావిడెంట్‌ఫండ్, టీఎస్‌జీఎల్ఐసీ, గ్రూప్‌ఇన్సూరెన్స్, మొదలగున్నవి చెల్లించలేదన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును కూడా ప్రభుత్వం అందజేయటం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఆర్‌లను విడుదల చేయాలని, పీఆర్సీ రిపోర్టు ప్రకటించాలని, నగదురహిత హెల్త్‌కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్.గోపీచంద్, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



సత్య హరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

అలరించిన సత్య హరిశ్చంద్ర నాటకం

నేలకొండపల్లి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి నేలకొండపల్లిలోని శ్రీభక్తరామదాస ధ్యాన మందిరంలో ప్రదర్శితమైన సత్యహరిశ్చంద్ర నాటకం విజయవంతమైంది. మొదటగా నేలకొండపల్లి శ్రీకర గార్డెన్స్‌లో ప్రదర్శించాలనుకున్న నాటకాన్ని అనివార్య కారణాల వలన భక్తరామదాస ధ్యాన మందిరంలోకి మార్చారు. నాటకాన్ని తిలకించటానికి నిర్వాహకులు ఆశించిన స్థాయిలో గాకున్నా, ఓ మాదిరిగా నాటకాభిమానులు రావటం నిర్వాహకులను ఒకింత సంతోషపర్చింది. నాటకాలకు పూర్తిగా ఆదరణ కరువవుతున్న ఈరోజుల్లో నాటకాలను ప్రదర్శించటం అంటే ఓ సాహసంగానే చెప్పాలి. నాటకాభిలాషులైన నేలకొండపల్లికి చెందిన గండికోట వేణుమాధవ్‌శర్మ, నేలకొండపల్లి ఎస్బీఐలో ఫీల్డ్‌ఆఫీసర్‌గా పని చేస్తున్న ముత్యాల సత్యనారాయణ కొంతమంది దాతల సహకారంతో నాటక ప్రదర్శన చేసి పెద్ద సాహసమే చేశారు. కృష్ణా జిల్లా లింగాలకు చెందిన వారు నాటకం ప్రదర్శించారు. హరిశ్చంద్ర పాత్రధారిగా ముత్యాల సత్యనారాయణ, చంద్రమతిగా జగ్గయ్యపేటకు చెందిన లక్ష్మీశ్రీ, విశ్వామిత్రుడిగా సలాది మల్లికార్జున నాయుడు, కాటికాపరిగా గండికోట వేణుమాధవ శర్మ వారివారి పాత్రల్లో రక్తి కట్టించారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కల్పన

ఖమ్మంలీగల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సోమవారం సీనియర్ సిటిజెన్‌డే సందర్భంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి ఎం.కల్పన వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. జీవనసంధ్య ఓల్డ్‌ఏజ్‌హోమ్‌ను సోమవారం ఆమె సందర్శించారు. వృద్ధులకు ఏదైన సమస్య ఉంటే ఖమ్మం జిల్లా న్యాయసేవాధికారసంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ సభ్యులు మందడపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవైన సమస్యలుంటే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. డాక్టర్ పూర్ణచందర్‌రావు ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహిస్తామని తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఖమ్మంక్రైం నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ద్వి చక్రవాహనం చోరీ ఘటనపై ఖానాపురంహవేలి పోలీసులకు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేశాడు.నగరానికి చెందిన వల్లభనేని రమేష్‌బాబు ఆదివారం నగరంలోని జరిగిన ఓ వనభోజన కార్యక్రమానికి హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లారు.అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేశారు. వనభోజన కార్యక్రమం ముగించుకొని వచ్చిచూడగా వాహనం కనిపించ లేదు.దీంతో రమేష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

కామేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గోవింద్రాల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లకావత్ సునీతలక్ష్మినారాయణ కుటుంబాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. ఇటీవల ఆమె అత్త సక్కుబాయి అనారోగ్యంతో మృతిచెందారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యానికి గురైన సీపీఎం జిల్లా నాయకులు దుగ్గి క్రిష్ణను ఎమ్మెల్యే పరామర్శించారు.

ఇళ్లు, భూ సమస్యలపై ఏకరువు

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు, భూసమస్యలపై ప్రజలు భారీగా అర్జీలు పెట్టారు. అదనపు కలెక్టర్లు శ్రీజ,పి.శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 120 మరకు దరఖాస్తులు రాగా పరిష్కరించాలంటూ అధికారులను వారు ఆదేశించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్షించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు డీపీవో ఆశాలత, డీఎంహెచ్‌వో డాక్టర్ డి రామారావు,బీసీసంక్షేమఅధికారి జ్యోతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

● ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ కార్పొరేటర్ షేక్ జాన్‌బీ రోటరీ నగర్‌లో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

● ఖమ్మంఅర్బన్ మండలంపుట్టకోట గ్రామానికి చెందిన భవాని, మరియమ్మ, మమత, రామకళ, శైలజ, మల్లీశ్వరి, లక్ష్మి తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మండల ప్రత్యేక అధికారుల పనితీరు, వివిధ అంశాలపై సమీక్ష

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై మండల ప్రత్యేక అధికారులు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై మండల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ప్రతీ శుక్రవారం చేపట్టిన తనిఖీ చేయాలన్నారు. ప్రతీమండల పరిధిలో ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు మండల పరిధిలో పకడ్బందీగా అమలు జరిగేలా మండల ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర వసతులు ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు జరిగేలా పర్యవేక్షించాలని కోరారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమం అమలు తీరును నిర్దిష్టంగా పరిశీలించాలన్నారు. విద్యా సంస్థలను తనిఖీ చేస్తూ అక్కడ పారిశుధ్య నిర్వహణ, భోజన నాణ్యత, పిల్లలకు అవసరమైన వసతులు పరిశీలించి నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన గుండాల కృష్ణ

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): సోమవారం ఖమ్మంవచ్చిన మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను బీసీ సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ సోమవారం ఖమ్మంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం బీసీరిజర్వేషన్ల అమలు, జిల్లాలో బీసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారివురు చర్చించారు.ఈకార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బొమ్మ రాజేశ్వరరావు, అమరగాని వెంకన్న, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు పాల్గొన్నారు.



సొంత భవనం వద్దు.. అద్దె భవనం ముద్దు

» పాడుబడిన టీఎస్ఐఐసీ కార్యాలయ భవనం
» పట్టించుకోని సంస్థ అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన టీఎస్ఐఐసీ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) అధికారులు వారికేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినడుతున్నాయి. ఖమ్మంలో 2007లో ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలో నిర్మించిన సంస్థ సొంత భవనాన్ని వదిలి పక్కనే ఓ అద్దె భవనాన్ని అద్దెకు తీసుకుంది. నెలకు సుమారు రూ.50 వేల వరకు సంస్థకు ఆర్థిక భారం తప్పటంలేదని తెలుస్తుంది. 2007లో సుమారు రూ.20 లక్షల వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించారు. టీఎస్ఐఐసీ అధికారులు పట్టమని ఏడాది కూడా ఆ భవనంలో లేరని తెలిసింది. ఆ తరువాత పక్కనే మరో అద్దె భవనాన్ని కిరాయికి తీసుకోని సొంత భవనాన్ని వదిలేయటంతో నేడు ఆ భవనం ముళ్లకంచెతో నిండిచెత్తాచెదారంతో దర్శనమిస్తుంది. ఇల్లెందు ప్రధాన రహదారికి ఆనుకోని ఉన్న ఆ సంస్థ ఖరీదైన ఖాళీ స్థలం పాడుబడింది. ఆ భవనానికి చుట్టూ నిర్మించిన ప్రహరిగోడ ముంటు కుంటేనే పడిపోయి ప్రమాదకరంగా మారింది. అక్కడ కొందరు ట్రాక్టర్ యజమానులు అడ్డాగా మార్చుకోవటంతో రోజు పదుల సంఖ్యలో కూలీలు వస్తుంటారు. ఎప్పుడైనా గోడ కూలీ ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని పలువురు కూలీలు ప్రశ్నిస్తున్నారు. రోజు వందలాది మంది తిరిగే ఈ ప్రాంతంలో ముళ్లకంచెతో నిర్మానుష్యంగా ఉన్న ఈ భవనం ఆందోళనకు గురి చేస్తోంది.



టీఎస్ ఐఐసీ కార్యాలయం

'పారిశుధ్యం'లో అవినీతి కంపు

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అడ్డదారిన జవాన్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ పొందిన పారిశుధ్య ఉద్యోగి తనకు ప్రమోషన్ కల్పించిన అధికారికి స్వామి భక్తిని చాటుకుంటూనే ఇతరుల వద్ద నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నాడని ఆరోపణలు ఇప్పుడు ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో చర్చకు దారితీసింది. పారిశుధ్య పనుల జాప్యంపై నిర్లక్ష్యంపై గతంలో విమర్శలు వెలువడినా పై స్థాయిలోని అధికారులు మాముళ్లు తీసుకోవటం లేదు. మూడు నెలలుగా అక్రమంగా ప్రమోషన్ పొందిన ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుధ్యంలో అవినీతికి తెరలేపినట్లు తెలుస్తోంది. ఉన్నతస్థాయిలోని అధికారి అండదండలు సంపూర్ణంగా ఉండటంతో పారిశుధ్య పర్యవేక్షకుడిని ధిక్కరించే స్థాయిలోకి వెళ్లటంతో సోమవారం చివాట్లు కూడా తిన్నారు. పారిశుధ్యంలో మాముళ్లు ముట్టి చెప్పిన వారి జోలికి పోవటం లేదని, పైసలు ఇవ్వని వారి వెంట పడుతున్నారని జవాన్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు సైతం చర్చించుకుంటున్నారు. ఒక వైపు పారిశుధ్యం సరిగా లేదని కార్పొరేటర్లు గగ్గోలు పెడుతుండగా మరోవైపు అవినీతి ఆరోపణలు వ్యాపించటంతో కేఎంసీ ఆ ప్రతిష్టను మూటగట్టుకుంటుంది.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా జిల్లాలోని పలుశివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ఆలయాలుమారుమోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకోని ఆలయంలో దీపాలు వెలిగించారు. నగరంలోని పలు శివాలయాలు, ఇతర ఆలయాలలో ప్రత్యేకపూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కైకొండాయిగుడెం రోడ్డులోని శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం నందీశ్వరుడికి పంచామృత అభిషేకం, వివిధ రకాల పూలతో పుష్పాభిషేకం నిర్వహించారు.



గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో..



అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేదు

కార్పొరేటర్ కన్నం వైష్ణవి

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడేదిలేదని పదికాలాలు పాటు పనులు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని కార్పొరేటర్ కన్నం వైష్ణవి పేర్కొన్నారు. 46వ డివిజన్‌లో చేపట్టిన పనులను కార్పొరేటర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు.రహదారుల నిర్మాణం తర్వాత వాటిని క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జీ, నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, దయ్యాల నాగేశ్వరరావు, ఎమ్మె రామకృష్ణ, చుంచు వెంకటేశ్వర్లు,సెల్వం జ్ఞానేశ్వర్, అద్దంకి కృష్ణ, వినోద్, జానీ, ముసలయ్య,ఆముదాల వెంకటనారాయణ, కోటమ్మ,శోభ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న వైష్ణవి, నాయకులు

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కూసుమంచి /తిరుమలాయపాలెం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో మిర్చితోటలను కృషి విజ్ఞానకేంద్రం-వైరాకు చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు, బీరోలు, కూసుమంచి మండలం రావిచెట్టు తండ, కూసుమంచి గ్రామాల్లో మిరపతోటలను పరిశీలించారు. వేరుకుళ్లు, కొమ్మకుళ్లు తెగుళ్లను సోకి దెబ్బతిన్నట్లు గుర్తించారు. అదేవిధంగా ఎండు తెగులు, తామరపురుగులు, అక్కడక్కడ సోకుతున్నట్లు తెలిపారు. పలుసస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వార నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితాదేవి, ఉద్యాన శాస్త్రవేత్త చైతన్య, కీటకశాస్త్రవేత్త పావని, వ్యవసాయవిస్తరణ శాస్త్రవేత్త ఫణిశ్రీ, హార్టికల్చర్ అధికారి అపర్ణ, ఏవో వాణి తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచిలో పంటను పరిశీలిస్తున్న దృశ్యం

గ్రానైట్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో వనసమారాధన

ఖమ్మంరూరల్,నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహోత్సవాన్ని రూరల్ మండలంలోని గుర్రాలపాడులోని మామిడితోటలో నిర్వహించారు. సంఘం సభ్యుల కుటుంబ సభ్యులతో హాజరై ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం సంఘం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవసలహాదారుడిగా అదాలత్ నరేందర్, వెంకటేశ్వర్లు,సంఘంగౌరవ అధ్యక్షుడిగా ఉపేందర్,అధ్యక్షుడిగా నూనావత్ కిషన్, సెక్రటరీగా ఎస్‌కే.జానీ,ఉపాధ్యక్షుడిగా శేషగిరి, కోశాధికారి సైదులు, రాంమూర్తి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హనమంతరావు, శ్రీను, దిలీప్, శ్రీకాంత్, రమేష్, అంజీ, ఫయాజ్హహన్, అలీమ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అసోషియేషన్ సభ్యులు

నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలి

కూసుమంచి ఏడీఏ సతీష్

నేలకొండపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందుబాటులో ఉంచాలని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.సతీష్ విత్తనాలు, ఎరువుల డీలర్లను కోరారు. సోమవారం నేలకొండపల్లి రైతువేదికలో మండల పరిధిలోని ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.రాధ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ సతీష్ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం ముటాపురం గ్రామ రైతులతో జరిగిన సమావేశంలో విత్తన మొక్కజొన్న వేసే రైతులు విత్తన ఏజెంట్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎటువంటి ఎగ్రిమెంటు చేసుకోకుండా మొక్కజొన్న పంట వేసుకోవద్దని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎంఏఓ రాధ, డీలర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూసుమంచి ఏడీఏ

లాడ్జిలో హ్యూమన్ ట్రాఫికింగ్ సిబ్బంది తనిఖీలు

ఖమ్మంక్రైం నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మయూరిసెంటర్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిపై హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ సభ్యులు సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందని సమాచారం రావటంతో వారు తనిఖీలు నిర్వహించి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ఖమ్మం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నాచారంలో లక్ష్మీ సుదర్శన హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

ఏన్కూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సందర్భంగా సోమవారం నాచారం శ్రీ వెంకటేశ్వర స్వామి సిద్ధి ఆశ్రమంలో లక్ష్మీసుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కలకం హరి ప్రవీణ్ శర్మ ఆద్వర్యంలో హోమం కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకట రెడ్డి దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యగా.. మిషన్ భగీరథ పైపులైన్లు

- ఏళ్లుగా ఇదే దుస్థితి సత్తుపల్లికి...
- ఇక్కట్లు పడుతున్నా మారని అధికారులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసలే వారంలో రెండుమూడు రోజులు కాలనీల్లో తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే ఇప్పుడు మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణంతో మరిన్ని సమస్యలతో సతమతమవుతున్నారు. పైపులైన్ల నిర్మాణం కోసం వీధులన్నీ తవ్విపూడుస్తున్నారు. పైపులు అమర్చి నెలలు గడుస్తున్నా పూడ్చకపోవడం, పూడ్చినా సీసీ నిర్మించకపోవడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడటంతో పాటు


పాతసెంటర్‌లో ఇటీవల తవ్వి పూడ్చిన రోడ్డు


మూడు రోజుల క్రితం తవ్వడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి పునరావృతమవుతున్నా ప్రజల ఇబ్బందులు పట్టవా అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం ప్రజలందరికీ తాగునీటి సమస్య లేకుండా చూడడానికి మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించగా అప్పటి నుంచి ఏదో ఒక సమస్య పునరావృతమవుతూనే ఉంది. సత్తుపల్లి పట్టణంలో ఏ మూలన చూసినా సీసీ రోడ్లతో పరిశుభ్రంగా దర్శనమిచ్చేది. కానీ కొన్నేళ్ల క్రితం తాగునీటి కోసం పైపులైన్ల నిర్మాణం చేపట్టగా అప్పటి నుంచి 23వార్డులలో తవ్వి సీసీ రోడ్లు ఏళ్లుగా నిర్మించకపోవడం, రోడ్లు ఎగుడుదిగుడుగా గుంతలమయంగా మారడం షరమామూలే. తాజాగా


ఎన్టీఆర్ నగర్‌లో తవ్వి సీసీ రోడ్డు నిర్మించని వైనం

మూడు రోజులు క్రితం లెనిన్ రోడ్, శ్రీనివాసాటాకీస్ రోడ్‌లలో మిషన్ భగీరత్ పైపులైన్ల కోసం తవ్వగా ఎప్పుడు పూడుస్తారోనని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నెలల క్రితం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోతవ్వగా సరిగ్గా పూడ్చకపోవడం, ఆ బురదను అక్కడే వదిలేయడం, సీసీ నిర్మించకపోవడం, ఇళ్లకు ఇచ్చే కనెక్షన్ గొయ్యి వద్ద బురద చేరడంతో ప్రజలు ఈ సమస్యలు ఇక తీరవా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై మునిసినల్ కమిషనర్ కొండ్రా నరసింహను వివరణ కోరగా పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు తాగునీటిని అందించేందుకు శ్రమిస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కల్లూరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ కల్లూరులో సోమవారం పలు గ్రామాల మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గత ఏడాది నవంబరు నెల నుంచి నేటి వరకు ఏజెన్సీ కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని చెప్పారు. బకాయిల భారంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తీసుకోవచ్చే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వేతనాలు రూ.10 వేలు ఇస్తామన్న హామీని అమలు పరచాలని డిమాండు చేశారు. ప్రభుత్వం కార్మికుల వేతనాల చెల్లింపులో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వారం రోజుల పాటుగా నిరసన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. స్పందించక పోతే పోస్ట్ కార్డు ఉద్యమంతో ముఖ్యమంత్రికి విన్నపాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ నివేదితకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏఐటీయూసీ నాయకులు దామాల దయాకర్ రావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పాగా సత్యవతి, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విత్తన మొక్కజొన్న వేసే రైతులు ఆగ్రిమెంట్ తీసుకోవాలి


కొణిజర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బాలజీ

కొణిజర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విత్తన మొక్కజొన్న వేసే రైతులు అగ్రిమెంట్ తీసుకోవడం హక్కుగా భావించాలని ఏవో బాలాజీ తెలిపారు. మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రిమెంట్ లేకు ండా ఎవరు విత్తన మొక్కజొన్న వేసుకోవద్దని సూచించారు. అగ్రిమెంట్ ఉండడంతో రైతుకు నష్టం జరిగినప్పుడు రైతులు ఏజెంట్లు, కంపెనీ నుంచి జరిగిన నష్టాన్ని పొందడానికి అవకాశం ఉంటుదన్నారు.మొక్కజొన్న ఏజెంట్ ఖాసీంబీ రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సత్వర పరిష్కారం

కారేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వస్తున్న వివిధ దరఖాస్తులను సత్వరవమే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ ఏ.రమేష్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటున్నారని, మండల పరిధిలోని పలుగ్రామాల నుంచి వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం దరకాస్తులు చేసుకుంటున్నవారి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యాక్రమాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ తో పాటు అన్నిశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే ఉత్పత్తి సాధ్యం: జీఎం


జేవీఆర్ ఒసీలో యోగాలో పాల్గొన్న సింగరేణి ఉద్యోగులు

సత్తుపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉంటేనే రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధ్యమని సింగరేణి సత్తుపల్లి జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక జేవీఆర్ ఓసీలో ప్రాచీన యోగ దినచర్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యోగ ట్రైనర్ షణ్ముఖ శివచంద్ర, పీటలు ఎన్వీఆర్.ప్రహ్లాద్, సునీల్‌శర్మ, అధికారులు సోమశేఖర్, డీ.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, కల్యాణ్‌రామ్, రామకృష్ణ, దారా కావ్య, శ్రీనివాస్, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి కార్యక్రమం


ఇరుముడి కడుతున్న ఆలయ అర్చకుడు

తల్లాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం అయ్యప్పస్వామీ దీక్షామాలధారులు ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మల్లవరం, రామానుజవరం, నరసింహారావుపేట గ్రామాల్లో ఇరుముడి కార్యక్రమం జరిగింది. వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

కుమ్మర, శాలివాహన వనసమారాధన


వనసమారాధన వేదికపై కుమ్మర, శాలివాహన ప్రజాపతి సంఘాల నాయకులు

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం వైరా, తల్లాడ మండలాల స్థాయిలో కుమ్మర, శాలీవాహన, ప్రజాపతి కార్తీకమాస వనసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈరెండుమండలాల పరిధిలోని ఆసామాజిక వర్గాలకు చెందిన వారు పాల్గొని వన భోజనాలు చేశారు. ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. ఆయా సంఘాల నాయకులు చిలివేరు జనార్ధన్ మొగిలిచర్ల సైదులు, దరిపల్లి చంద్రశేఖర్, వీరబాబు, చలిగంటి బిక్షమయ్య, కొలిచలం బ్రహ్మయ్య, గీత గుమ్మడల వెంకటనారాయణ, సంగెపు వెంకటేశ్వరరావు, కృష్ణ, దరిపల్లి శ్రీనివాసరావు, వైరా ఎంపీఐ ఏ. వరప్రసాద్, డీఈ కోడూరు లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో పాలకులు విఫలం

- సీపీఎం నాయకుడు కృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

కారేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గట్టెక్కడానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం మండల కమిటీ సమావేశం ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు అమలుకు నోచుకోలేదని కొన్ని హామీలు పాక్షికంగా అమలు చేసి పూర్తి అమలు చేసినట్లు ప్రకటించుకుంటున్నారని అన్నారు. రైతు రూణమాఫీ మధ్యలోనే ఆగిందని, రబీ సీజన్ బోనస్ వేయలేదని, రైతు భరోసాను ప్రభుత్వం భారంగా భావిస్తుందన్నారు. తుఫాన్‌తో చేతికి వచ్చిన పంటలు తుడిచిపెట్టక పోయియని. పత్తి రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు సుంకర సుధాకర్, మండల కార్యదర్శి కె.నరేందర్, నాయకులు వజ్జా రామారావు, రేగళ్ళ మంగయ్య, కె.ఉమావతి,అజ్మీర శోభన్‌బాబు,కెసగాని ఉపేందర్, పండగ కొండయ్య, లక్ష్మన్, తేజవత్ చందర్, కొండల్‌రావు, కరపటి సీతారాములు,రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యువ వికాసం కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతన్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్

కల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం లయన్స్‌క్లబ్, ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య ఆద్వర్యంలో విద్యార్థులకు యువ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ విద్యార్థుల మానసికస్థితి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై వారిలో ఉండాల్సిన గౌరవం తదతర అంశాలపై వారు అవగాహన కల్పించారు.

ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రమాదలు, నివారణ, జగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతర కళాశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాకీలాభాను, లయన్స్ జెబి మోహన్, రాజయ్య, అధ్యాపకులు, విద్యారులు పాల్గొన్నారు.

వైరాలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వైరాలో రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నిర్మిస్తామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. ఈ స్కూల్‌నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా విద్యలో కొత్త ప్రమాణాలను నెలకొల్పి దేశం గర్వపడేలా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వైరాలో ఈ స్కూల్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కొద్దిరోజుల్లో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.సమత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రారాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, ఏఎంసీ చైర్మన్, మాజీ ఛైర్మన్లు బోళ్ల గంగారావు, బీడీకే. రత్నం, నాయకులు ధార్న రాజశేఖర్, పమ్మి అశోక్, దాసరి దానియేలు, తేళ్లూరి వీరయ్య, తోటకూర గోపి పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఖమ్మంలో జరుగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల ప్రచార కరపత్రాలను ఆసంఘం జిల్లా సహాయ కార్యదర్శి శశికిరణ్ ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాలను శశికిరణ్ ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సభలకు ప్రతీ ఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మృతుల, తేజశ్రీ, అంజలి, ఝాన్సీ, సంధ్య, మల్లిక పాల్గొన్నారు.

'విజయ'లో రెనాల్ట్ నిస్సాన్ ప్లేస్‌మెంట్ డ్రైవ్


కళాశాల యాజమాన్యం, అధ్యాకపక బృందంతో ప్లెస్‌మెంట్ పొందిన విద్యార్థులు

కొణిజర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ ఆటోమొబైల్ సంస్థ రెనాల్ట్ నిస్సాన్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను సోమావరం నిర్వహించింది. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈసీఈ, ఈఈఈ విభాగాల విద్యార్థులకు ఆ సంస్థ ప్రతినిధులు డ్రైవ్ నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరు కాగా వారికి రాత పరీక్ష టెక్నికల్, ఇంటర్వ్యూ, హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి 40మంది విద్యార్థులు రెనాల్ట్ నిస్సాన్ కంపెనీకి ఎంపిక చేశారు. ఈ సందర్భగా కళాశాల వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి ఎంపికయిన విద్యార్థులను అభినందిస్తూ వారికి ఆఫర్‌లెటర్ అందించారు. విద్యార్థుల్లో కృషి, పట్టుదల ఉంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆమె తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌చిన్నయ్య మాట్లాడుతూ.. అంతర్జాతీయస్థాయి సంస్థలో తమ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం చాలా గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ ఫరీద్‌బాబా, ఆయా కోర్సుల విభాగాల శాఖాధిపతులు, అధ్యాపకులుపాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడా సామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

మధిర రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని పది ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రిని క్రీడా చేయూత,హైకేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. రూ.60వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. వాలీబాల్ నెట్స్, వాలీబాల్స్, వాలీబాల్ పోల్స్‌ను ఆయా పాఠశాలల పీఈటీలకు అందజేశారు. ఖమ్మంజిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికి తీయడమే ఈ పంపిణీ కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. క్రీడా చేయూత అధ్యక్షుడు అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈవో వై.ప్రభాకర్, గూడూరు కోటిరెడ్డి, జంగా కోటిరెడ్డి, హైకేర్ హాస్పిటల్ డాక్టర్ నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, శ్యామ్, ప్రమీల రాణి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామారావు, పీడీ చిన్నీ, రంజాన్, విజ్జి, హర్షిత, అపర్ణ, నర్సింహారావు, చైతన్య, వీర రాఘవయ్య పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల అవస్థలు


డీపీవోకు వినతి ప్రతం అందిస్తున్న బాధితులు

కల్లూరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మునిసిపాలిటీలో పలు రకల ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. సోమవారం పలువురు బాధితులు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీపీవో కరుణశ్రీని నేరుగా కలిసి వినతి పత్రం అందించారు. 2025 సవంత్సరం మే నెల 28వ తేదిన కల్లూరు మునిసిపాలిటీగా ఏర్పడగా, అంతకన్నా ముందు మునిసిపాలిటీ పరిధిలో(గ్రామ పంచాయితీగా ఉన్నప్పుడు) జననాలు, మరణాలు జరిగినటువంటి సమాచారం కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటీలో అప్డేట్ కానందున దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పలువురు బాధితులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పైవిధంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీపీవో కరుణశ్రీ స్పందిస్తూ ధృవీకణ పత్రాల అందిచండంలో సత్వరమే చర్యలు తీసుకోవాలని మునిసిపాలిటీ కమిషన్‌కు ఆదేశించారు. ఇలా గత ఆరు నెలలుగా సుమారు 200 వరకు పలు రకాలుగా ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు ఎదరు చూపులు చుస్తున్నారని సమాచారం. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్, కోట పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెతో నిలిచిన కొనుగోళ్లు

- దళారులను ఆశ్రయిస్తున్నరైతులు


సమ్మెతో మూతపడిన జిన్నింగ్ మిల్లు

కారేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో నిరవధిక సమ్మెతో పత్తి కొనుగోళ్ళు నిలిచి పోయాయి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిన్నింగ్ మిల్లులను ప్రభుత్వం, సీసీఐ అధికారులు ప్రారంభించి నడిపించాలని కోరుతూ సోమవారం నుంచి తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెతో జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులతోపాటు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీప్రియ కోటెక్స్ మిల్లు కూడా మూతపడింది. జిన్నింగ్ మిల్లు మూతపడటంతో పరిసర ప్రాంతాల నుంచి పత్తి అమ్ముకునేందుకు వచ్చిన సన్న, చిన్నికారు రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైతులను దళారులు నట్టేటా ముంచుతూ అతితక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేస్తు రైతులను దోచుకుంటున్నారు. సమ్మె ఎన్ని రోజులు జరుగుతుందో తెలియని పరిస్థితి. సీసీఐ సంస్థ వారు ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో రాష్ట్రంలో కొన్ని జిన్నింగ్ మిల్లులు మాత్రమే నడుపుతున్నారని, దీంతో మిగిలిన మిల్లులకు సంబంధించిన వారు నష్టపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా అన్ని మిల్లులను నడపాలని కోరుతూ సమ్మెబాట పట్టిన్నట్లు మిల్లర్స్ తెలిపారు.

ఉచితంగా 9లక్షల చేపపిల్లల పంపిణీ

సత్తుపల్లిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని 11గ్రామ పంచాయితీలకు 29చెరువులు, కుంటలకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో 9లక్షల చేపపిల్లలను పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100శాతం రాయితీపై బొచ్చ, రవ్వ, బంగారుతీగ రకం చేప పిల్లలను 2025-26 సంవత్సరానికి గానూ 35-40 ఎంఎంఎ సైజు ఉన్న చేపలను అందించినట్లు ఫిషరీస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఫిషరీస్ అధికారులు రమణ, రాజేష్, బెనర్జీలతో పాటు పంచాయితీ సెక్రటరీలు, చేపల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


చేప పిల్లలను అందిస్తున్న మత్స్యశాఖ అధికారులు

కార్తీక మాసం.. ప్రత్యేక పూజలు


వైరాలో కార్తీకదీపోత్సవానికి హాజరైన మహిళలు


బేతుపల్లిలో దయానంద్‌ను సన్మానిస్తున్న సభ్యులు


కల్లూరు వీరభద్రస్వామి ఆలయ పూజల్లో భక్తులు

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక మాస చివరి సోమవారం రాత్రి కమ్మవారి కల్యాణ మండపంలో కార్తీక దీపోత్సవ వేడుకలు నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్. కమ్మ జన సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు కట్టా కృష్ణార్జునరావ్ చింతనపు రాంబాబు కోశాధికారి ఏనుగు హనుమంతరావు ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీరామనేని రామస్వామి సభ్యులు సూర్యదేవర శ్రీధర్ చింతనపు మురళి వడ్డే నారాయణరావు చెరుకూరి కిరణ్ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: కార్తీక మాసంలో చివరి సోమవారం సందర్భంగా పలు శివాలయాలలో భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ బేతుపల్లిలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమతే గౌతమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కల్లూరు: కార్తకమాసం చివరి సోమవారం సందర్భంగా నారాయణపురంలో గల భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యవసాయ రంగాన్ని దివాళా తీయిస్తున్న కేంద్ర ప్రభుత్వం

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం దివాళా తీయిస్తుందని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు. తోట నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం వైరాలో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ వత్తిళ్లకు లొంగిపోయి విదేశాలనుంచి పత్తి, మొక్కజొన్న, రొయ్యలు వంటి పంటలను దిగుమతి చేసుకొని దేశంలో పండించే పంటలకు గిట్టుబాటు ధరలేకుండా చేస్తుందని విమర్శించారు. సీపీఎం డివిజన్, మండల నాయకులు మేరుగు సత్యనారాయణ, బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్, బాజోజు రమణ, గరిడేపల్లి సుబ్బారావు, మేడా శరాబందీ, బాణాల వెంకట్రావమ్మ, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండేళ్ల బాలుడిపై కుక్కల దాడి



తల్లాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనకల్ గ్రామంలో సోమవారం కుక్కలు జరిపిన దాడిలో రెండేళ్ల బాలుడికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఆంధ్ర నుంచి బాతుల పెంపకం కోసం వలస వచ్చిన కుటుంబానికి చెందిన బాలుడు సిద్ధార్థపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడ్డా బాలుడిని చికిత్స కోసం 108 వాహనంలో ఖమ్మం తీసుకువెళ్లారు.